క్లుప్తంగా

వీడియో జర్నలిస్ట్ శ్రీధర్‌కు వాసుపల్లి ఆర్థిక సాయం



శ్రీధర్ ఇంటికెళ్లి ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : ప్రముఖ చానెల్‌లో కెమెరామే న్‌గా పని చేస్తున్న సీనియర్ వీడియో జర్నలిస్ట్ శ్రీధర్‌కు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారు. రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల న్యూస్ కవరేజ్‌లో ప్రమాదవశాత్తు ఎడమ చేయి విరిగిపోవడంతో గత కొద్ది రోజులుగా ఇంటి వద్దే చికిత్స పొందుతున్న శ్రీధర్ ఇంటికి వాసుపల్లి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఏ అవసరం వచ్చినా తనకి కాల్ చేయమని భరోసా నింపారు. జర్నలిస్టులంటే ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచే శ్రమజీవులన్నారు. పని ఒత్తిడితో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జర్నలిస్టులను వాసుపల్లి కోరారు. కార్యక్రమంలో ముజీబ్‌ఖాన్, గనగల్ల రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సమయానికి తగు వ్యాపారం



బీఆర్ రెడ్డి జంక్షన్‌లో గొడుగుల వ్యాపారం చేస్తున్న బాలుడు

అల్లిపురం : వర్షం పడితే అందరూ ఉపయోగించేవి గొడుగులు. గొడుగు లేనిదే గత రెండు రోజులు ఎవ్వరు బయటికి వెళ్లలేని పరిస్థితిని ఒక వ్యాపారి వినియోగించుకున్నాడు. సమయానికి తగిన వ్యాపారంగా అల్లిపురం బీఆర్ రెడ్డి జంక్షన్‌లో ఒక బాలుడు గొడుగులు లైన్‌గా పేర్చి అందరినీ ఆకట్టుకుంటూ తన వ్యాపారాన్ని కొనసాగిస్తూ ఆకర్షిస్తున్నాడు.

కృష్ణావతారంలో అలరించిన వెంకన్న



కృష్ణావతారంలో దర్శనమిస్తున్న వెంకన్న

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. శ్రావణమాసం ఆఖరి శనివారం సందర్భంగా స్వామిని విశేషంగా అలంకరించారు. కృష్ణాష్టమి వేడుకలు ముగింపు సందర్భంగా వెంకన్న శ్రీకృష్ణుని అవతారంలో భక్తులను అలరించారు. నల్లనయ్యగా ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తుల గోత్రనామాలతో సహస్రనామాభిషేకాలు చేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



కళ్యాణ్ (ఫైల్)

సీతమ్మధార : విద్యుత్ షాక్‌తో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్.కోటకు చెందిన కళ్యాణ్ (59) ఉపాధి కోసం విశాఖ వచ్చి డైమండ్ పార్క్ ప్రాంతంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. డైమండ్ పార్కు సమీపంలో శనివారం సాయంత్రం రోడ్డు దాటుతున్న సమయంలో అక్కడ వైర్ పడి ఉండడాన్ని గమనించి... దాన్ని పక్కకు పెట్టడానికి పట్టుకోగా విద్యుత్ సరఫరా ఉండడంతో షాక్ తగిలింది. వెంటనే అతడిని కేజీహెచ్‌కు తరలించినప్పటికీ.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. అతనికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివారులో శుభ్రత..

నడిమధ్యలో అపరిశుభ్రత



యార్డులో అపరిశుభ్రంగా ఉన్న క్లోజ్డ్ కాంపెక్ట్ వాహనాలు నిలిపే ప్రాంతం

జీవీఎంసీ 35వ వార్డు టౌన్ కొత్తరోడ్డు వద్ద జీవీఎంసీ డంపింగ్ యార్డు ఉంది. ఈ యార్డుకు జోన్–4తో పాటు జోన్–3, 5 ప్రాంతాల నుంచి కూడా చెత్త వస్తుంది. ఇలా రోజుకు రెండు వందల టన్నుల వరకు చెత్తను ఈ యార్డుకే తరలిస్తున్నారు. దీనిని ఎప్పటికప్పుడు కాపులుప్పాడ తరలించడానికి క్లోజ్డ్ కాంపెక్ట్ వాహనాలు ఏర్పాటు చేశారు. అయితే చెత్తను తరలిస్తున్నారు తప్ప దుర్వాసనను మాత్రం ఆపలేకపోతున్నారు. దీని వలన పాతనగర వాసులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఊరవతల కాపులుప్పాడ డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన రాకుండా అనేక ఆధునిక చర్యలు తీసుకున్న జీవీఎంసీ.. ఊరి మధ్యలోని 35వ వార్డు పరిధి టౌన్ కొత్తరోడ్డు డంపింగ్ యార్డులో మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల తాము దుర్వాసనతో జీవించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- చిత్రమైన జీవీఎంసీ తీరు
- ఎలాంటి దుర్వాసన రాకుండా కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ నిర్వహణ
- టౌన్ కొత్తరోడ్డు డంపింగ్ యార్డ్ నిర్వహణలో నిర్లక్ష్యం
- దుర్వాసనతో నరకం చూస్తున్న 35వ వార్డు స్థానికులు



టౌన్‌కొత్తరోడ్డు డంపింగ్ యార్డు నుంచి తరలించాల్సిన చెత్త

జగదాంబ : దుర్వాసన రాకుండా ఎప్పటికప్పుడు చెత్తను తరలించేందుకు జీవీఎంసీ క్లోజ్డ్ కాంపెక్ట్ సిస్టం ఏర్పాటు చేసినా దుర్వాసన సమస్య యథావిధిగా కొనసాగుతోందని 35వ వార్డు పరిధి టౌన్ కొత్తరోడ్డు ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న యార్డుకు జీవీఎంసీ జోన్–4తో పాటు జోన్–3, 5 నుంచి రోజుకు రెండు వందల టన్నుల వరకు చెత్త వస్తుంది. దీనిని ఎప్పటికప్పుడు కాపులుప్పాడ యార్డుకు తరలించడానికి క్లోజ్డ్ కాంపెక్ట్ వ్యాన్లు ఏర్పాటు చేశారు. అయితే చెత్తను తరలిస్తున్నారు తప్ప దుర్వాసనను మాత్రం ఆపలేకపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల వ్యాధులకు గురవుతున్నట్లు తెలిపారు. ఊరి మధ్యలో యార్డు పెట్టి ప్రజారోగ్యం పట్ల జీవీఎంసీ నిర్లక్ష్యం వహిస్తుందని వారు ఆరోపిస్తున్నారు. పాలకులు, అధికార యాంత్రంగం కనీస చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. యార్డులోని చెత్త వల్ల అప్పుడప్పుడు గ్యాస్ తదితర వాయువులు వెలువడుతుండటం వల్ల ఒక్కోసారి మంటలు కూడా వ్యాపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణాల వల్ల తాము నివసించలేకపోతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. దీనికి తోడు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా చెత్త మరింత దుర్వాసన వెదజల్లుతుందని, వ్యాధులకు గురి కావల్సి వస్తుందని భయపడుతున్నారు.



రామకృష్ణానగర్ వద్ద జీవీఎంసీ పార్కు నిర్మించాల్సిన ప్రాంతం

యార్డును తరలించాలంటూ...

గతంలో టౌన్ కొత్తరోడ్డు వద్ద ఉన్న యార్డును జనావాసాల మధ్య నుంచి పూర్తిగా తరలించాలని స్థానికులు ధర్నాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుని యార్డులో చెత్త మొత్తం తరలించి గ్రౌండ్ జీరో క్లియరెన్స్ చేసేవారు. దీని వల్ల అప్పట్లో ప్రజలు అలజడులు, ధర్నాలు లేకుండా జీవించేవారు. మరలా ఇప్పుడు పాత పరిస్థితే వచ్చిందని మండిపడుతున్నారు.

ఊరవతల అభివృద్ధి..
ఊరి మధ్యలో నిర్లక్ష్యం..

కాపులుప్పాడ తరలించిన చెత్త దుర్వాసన రాకుండా యార్డులో అనేక ఆధునిక చర్యలు తీసుకుంటూ యార్డును అభివృద్ధి చేస్తున్నారు. దీని వల్ల ఆ చుట్టుపక్కల ప్రాంత ప్రజలకు ఎలాంటి దుర్వాసన సమస్య లేదని టౌన్ కొత్తరోడ్డు ప్రాంత ప్రజలంటున్నారు. కానీ ఎన్నో ఏళ్లుగా ఊరి మధ్యలో ఉన్న ఇక్కడి యార్డును కనీసం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఏళ్ల తరబడి దుర్వాసన, వ్యాధులతో సతమతమవుతున్న తమను పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి యార్డుకు దగ్గరలో ఉన్న రామకృష్ణానగర్ వద్ద ఆహ్లాదం కోసం నిర్మించాల్సిన పార్కును కూడా నిర్మించలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యార్డులో చెత్తను పూర్తిగా తరలించి దుర్వాసన నుంచి తమకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

తగిన చర్యలు తీసుకుంటాం..



యార్డులో చెత్త నిల్వ లేకుండా తరలిస్తున్నాం. రోజూ ఉదయం నుంచి వచ్చిన చెత్త మధ్యాహ్నం కాపులుప్పాడకు క్లోజ్డ్ కాంపెక్ట్ వ్యాన్లలో తరలిస్తున్నాం. అప్పటికీ చెత్త ఉంటే రాత్రి వేళల్లో కూడా తరలింపు చర్యలు చేపడుతున్నాం. ఇటీవలే ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నాను. పూర్తిస్థాయిలో పర్యవేక్షించి స్థానికులు దుర్వాసనతో బాధ పడకుండా తగిన చర్యలు తీసుకుంటాను.

– జనుమూరి కృష్ణంరాజు, ఏఎంహెచ్‌వో, జీవీఎంసీ జోన్–4 ఇన్‌చార్జి

కలెక్టర్‌ను కలిసిన మత్స్యశాఖ కమిషనర్



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మత్స్యశాఖ కమిషనర్ డోల్లా శంకర్

మహారాణిపేట : రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి.డోల్లా శంకర్ శనివారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మత్స్యకారులకు సంబంధించి పలు విషయాలు చర్చించారు.

రైతుబజార్‌లో పశువుల బెడద



రామకృష్ణా రైతుబజార్ వద్ద రోడ్డుపై సంచరిస్తున్న ఆవులు

జగదాంబ : రామకృష్ణా రైతుబజార్ వద్ద పశువులతో ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు, వ్యాపారులు చెబుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డులో ఈ మార్కెట్ ఉంది. ప్రధాన రహదారికి పక్కనే ఈ మార్కెట్ ఉండడంతో ఆవులు దుకాణాల వద్దకు వస్తున్నాయని, దీని వల్ల మార్కెట్ లోపలికి వెళ్లడానికి సాహసించలేకపోతున్నాం అని వినియోగదారులు అంటున్నారు. మార్కెట్‌లోను, రోడ్డు మధ్య సంచరిస్తున్న వీటి వల్ల వాహన చోదకులు ప్రమాదాలకు కూడా గురవుతున్నట్లు చెబుతున్నారు. పశువుల యాజమానులు ఇంటి వద్ద వాటిని కట్టకుండా వదిలేయడంతో రోజూ ఈ బెడద తప్పడం లేదని, వాటి వల్ల తమ వ్యాపారాలు సాగడంలేదని వ్యాపారులు చెబుతున్నారు. జీవీఎంసీ వెటర్నిటీ సిబ్బంది వెంటనే స్పందించి రోడ్డుపై పశువులు లేకుండా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు, వ్యాపారులు కోరుతున్నారు.

తెరిపివ్వని వర్షం



వర్షం కారణంగా వెలవెలబోతున్న అల్లిపురం మార్కెట్ రోడ్డు



వర్షంతో మురుగునీరు రోడ్డుపై పారటంతో అల్లిపురం మెయిన్‌రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

అల్లిపురం : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరం తడిసి ముద్దయింది. రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. కాలువల్లో మురుగు రోడ్లపైకి రావటంతో రోడ్లు చెత్తా చెదారంతో నిండుకున్నాయి. వర్షాల కారణంగా పారిశుధ్య సిబ్బంది కూడా రాకపోవటంతో ఎక్కడ చెత్త అక్కడే నిలిచిపోయింది. వర్షం కారణంగా వ్యాపారాలు లేక అల్లిపురం మార్కెట్ వెలవెలబోయింది. అత్యవసరమైన వారు మాత్రమే గొడుగులను ఆశ్రయించి దుకాణాలకు వెళ్లి నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసుకున్నారు. మరో రెండు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించటంతో ప్రభుత్వ పాఠశాలలకు శనివారం సెలవు ప్రకటించడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేదు. శనివారం ఉదయం నుంచి వర్షం వచ్చీపోతూ ఉండటంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ధరాభారంపై సీపీఐ పోరుబాట



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో అన్ని వర్గాల ప్రజలపై ధరల భారం పెరుగుతోందని సీపీఐ ఆందోళన వ్యక్తం చేసింది. పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ 1వ తేదీ నుంచి వారం రోజుల పాటు దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు తెలిపారు. ఈ మేరకు రూపొందించిన పోస్టర్‌ను శనివారం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో సామాన్యులు బతకలేని స్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలే ధరల పెరుగుదలకు కారణమని విమర్శించారు. ప్రజల పక్షాన నిలిచిన సీపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆదివారం నుంచి వారం రోజుల పాటు పార్టీ శ్రేణులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.కె.రెహ్మాన్, పి.చంద్రశేఖర్, సీఎన్ క్షేత్రపాల్, జేడీ నాయుడు, ఎస్.నాగభూషణం, ఎ. దేముడమ్మ, బి.పుష్పలత, జి.కాసులరెడ్డి, సీహెచ్ కాసుబాబు, బి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు ఆధునిక టెక్నాలజీ



మత్స్యకార నాయకులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ కమిషనర్ డోల్లా శంకర్

మహారాణిపేట : చేపల వేటలో ఆధునిక టెక్నాలజీ వినియోగిస్తున్నామని, ముందుగా దీనిపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నట్లు రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ టి.డోల్లా శంకర్ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయం వద్ద వివిధ మత్స్యకార సంఘాల నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ వారితో మాట్లాడుతూ బోట్లు వేట సమయంలో బోల్తా పడకుండా, కెరటాల వల్ల బోటు అదుపు తప్పకుండా నియంత్రించే ఆధునిక టెక్నాలజీని ప్రయోగాత్మకంగా ప్రవేశ పెడుతున్నామన్నారు. బోటు యాజమానులు, మత్స్యకారులు దీనిపై అవగాహన కలిగించుకోవాలన్నారు. కమిషనర్ వెంట మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయ కూడా ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మర పడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మయ్య, విశాఖ కోస్టల్ మర బోటు సంఘం అధ్యక్షుడు బర్రె కొండబాబు తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీతారాం

విశాఖ విద్య: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో శనివారం ఎస్‌డీ దరి సరస్వతీ విద్యావిహార్ పాఠశాలలో జీసీడీవో డాక్టర్ ఖలీషా బేగం సమన్వయకర్తగా, గోపాలపట్నం ఎంఈవో సోమేశ్వరరావు అధ్యక్షత బాలల హక్కులపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీతారాం మాట్లాడుతూ ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటుతో పిల్లల దృష్టి మత్తు వైపు మరలకుండా అవగాహన కల్పించే అవకాశం ఉంటుందన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌తో పాటు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఉమారాజ్,సైకాలజిస్ట్ మంత్రి వంశీ, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు,ఐ.సి.డి.ఎస్. అధికారి ఎం.వి.రమణ కుమారి పాల్గొన్నారు.

27వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : శ్రావణమాసం సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు శనివారం 27వ రోజుకి చేరాయి. ఈ సందర్భంగా అమ్మవారికి వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య ఉదయం 8.10 గంటలకు శ్రావణ లక్ష్మీ పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు విశిష్ట శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన జీవీఎంసీ కమిషనర్

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్–4 పరిధి 28వ వార్డు పితానిదిబ్బ, బంగారమ్మ ఆలయ సమీపంలో పలువురు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ శనివారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఈ పింఛన్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన క్రమం తప్పకుండా ప్రభుత్వం సామాజిక పింఛన్లు అందిస్తుందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబర్ ఒకటో తేదీ ఆదివారం రావడం, ప్రభుత్వ సాధారణ సెలవు కారణంగా ముందు రోజే పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

లాడ్జిలో యువకుడి ఆత్మహత్య

అల్లిపురం: లాడ్జిలో పనిచేసే యువకుడు.. అదే లాడ్జిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలివీ.. ములగాడ గ్రామానికి చెందిన సర్వసిద్ధి మహేష్ (23) అల్లిపురంలోని ఓ లాడ్జిలో బాయ్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి మహేష్ విధులకు హాజరయ్యాడు. అనంతరం విధులు ముగించుకుని లాడ్జిలోని గదిలో నిద్రించాడు. ఉదయం బయటకు రాకపోయే సరికి.. తోటి ఉద్యోగి అతన్ని నిద్ర లేపేందుకు గది వద్దకు వెళ్లాడు. గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న మహేష్‌ను చూసి షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనపై లాడ్జి ఉద్యోగులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. వారు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అతని సోదరుడు జగదీష్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

కర్రను ప్రమాద సూచికగా ఏర్పాటు చేసిన వ్యాపారులు



ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్‌కు ప్రమాద సూచికగా ఏర్పాటు చేసిన కర్ర

అల్లిపురం : జీవీఎంసీ 34వ వార్డులోని రామకృష్ణా జంక్షన్ నుంచి మున్సిపల్ కాలనీకి వెళ్లే రోడ్డులో తెరుచుకున్న మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. కాలువపై మ్యాన్ హోల్ పైకవర్ లేకపోవటంతో వాహన చోదకులు, పాదచారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని తలచిన స్థానిక కూరగాయల వ్యాపారులు అక్కడ ప్రమాద హెచ్చరిక ఏర్పాటు చేశారు. ఒక కర్రను అందులో పెట్టి ఒక ఎర్రటి గోనెముక్కను హెచ్చరికగా ఏర్పాటు చేశారు. దీంతో వాహన చోదకులు దాన్ని గమనించి ప్రయాణిస్తున్నారు. జీవీఎంసీ సిబ్బంది సకాలంలో స్పందించి మ్యాన్‌హోల్ కవర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కొండ నాలుకకు మందేస్తే..

- శిథిలమైన పైప్‌లైన్‌కు మరమ్మతు చేయబోయిన జీవీఎంసీ సిబ్బంది
- అది మరింత శిథిలమై ఆ ప్రాంతంలో గుంతలు పడిన వైనం



పైప్‌లైన్ మరమ్మతు కోసం తవ్వి వదిలేసిన ప్రధాన తాగునీటి పైపులైన్

జగదాంబ : కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిపోయినట్టు తయారైంది పాతనగరం తాగునీటి సరఫరా ప్రధాన పైపులైను పరిస్థితి. జీవీఎంసీ 35వ వార్డు డయాస్ ట్యాంక్ నుంచి పాతనగరంలో అన్ని వార్డులకు తాగునీటి సరఫరాకు గతంలో ప్రధాన పైపులైను ఏర్పాటు చేశారు. ఈ పైప్‌లైన్ పరిధిలో అనేక చోట్ల కల్వర్టులు, రహదారుల వంటి నిర్మాణాలు చేపట్టడం, వాహనాల రాకపోకల వల్ల పైపులైన్ కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల 35వ వార్డు వెలంపేట కల్వర్టు కింద ఉన్న ప్రధాన పైపులైన్ శిథిలమై తాగునీరు వృథాగా పోయేది. దీనిపై సాక్షిలో వృథాగా తాగునీరు శీర్షికన వార్త ప్రచురితం అయింది. దీంతో జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులు హుటాహుటిన పైపులైన్ మరమ్మతుల కోసం తవ్వకాలు చేపట్టారు. ఈ చర్యల వల్ల పైపులైన్ అంతా శిథిలం కావడంతో కవర్లు కట్టి వదిలేశారు. వెల్డింగ్ చేసినా ఆగని నీటి ప్రవాహానికి కవర్లు కట్టడమా అంటూ స్థానికులు హేళన చేస్తున్నారు. దీంతో పాటు పైపులైన్ తవ్వి, కల్వర్టుపై ఉన్న సిమెంట్ పలకలు తీసేయడంతో అక్కడ గొయ్యి ఏర్పడింది. పైపులైన్ మాట దేవుడెరుగు ఇప్పుడు ప్రమాదాలకు అవకాశం కల్పించినట్లు అయిందని స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పైపులైన్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి కల్వర్టుపై పలకలు వేయించాలని కోరుతున్నారు.

పెట్రోల్ బంక్ సమీపంలో నీటి కాలుష్యంపై విచారణ

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు పరిధి అక్కయ్యపాలెం సంఘం ఆఫీస్ కూడలిలో ఉన్న బీపీసీఎల్ పెట్రోల్ బంకు చుట్టు పక్కల ఉన్న అపార్టుమెంట్లలో బోరు నీరు పెట్రోల్, డీజిల్ వాసన వస్తోందని సుగుణాభిరామ అపార్టుమెంట్ వాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీతమ్మధార తహసీల్దార్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో వివిధ విభాగాల అధికారులు కలిసి సర్వే చేపట్టారు. సివిల్ సప్లై, బీపీసీఎల్ ఆయిల్ కంపెనీ, గ్రౌండ్ వాటర్ విభాగం, పొల్యూషన్ బోర్డు, జీవీఎంసీ వాటర్ సప్లై, జీవీఎంసీ హెల్త్ (శానిటేషన్), ఏయూ జియాలజీ విభాగం అధికారులతో కలిసి తహసీల్దార్ రమేష్ శనివారం పెట్రోల్ బంకును పరిశీలించారు. అలాగే పెట్రోల్ బంకు చుట్టూ ఉన్న బాధిత అపార్టుమెంట్ వాసులను కలిసి వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. గత 8 నెలలుగా పెట్రోల్, డీజిల్ వాసనతో ఇళ్లల్లో నీరు వాడడానికి పనికి రాకుండా పోతోందని, డబ్బులు వెచ్చించి ట్యాంకర్లతో నీళ్లు తెప్పించుకుంటున్నట్టు అపార్టుమెంట్ వాసులు అధికారులకు తెలిపారు. గత 35 ఏళ్లుగా ఇక్కడ నివసిస్తున్నామని, ఎప్పుడూ ఇటువంటి సమస్య రాలేదని, పెట్రోల్ బంకు పెట్టిన తర్వాత సమస్య వచ్చిందని తెలిపారు. నీటి శాంపిల్స్ పరీక్షకు పంపగా పెట్రోల్, డీజిల్ కలిసినట్టు రిపోర్టు ఇచ్చారన్నారు. తమ ఇళ్లల్లో నీరు ఎందుకు కలుషితం అవుతుందో నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అపార్టుమెంట్ నివాసితులు పడుతున్న ఇబ్బందులపై అధికారులు రాత పూర్వకంగా వినతులు తీసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ పెట్రోల్ బంకు పరిసరాల్లో 200 మీటర్ల వరకు నీరు కలుషితమై పెట్రోల్, డీజిల్ వాసన వస్తున్నట్టు గుర్తించామన్నారు. దీనిపై జియాలాజికల్ సర్వే చేయాల్సి ఉందని, తమ బృందం చేపట్టిన విచారణ నివేదిక కలెక్టర్‌కు సమర్పిస్తామని ఆయన తెలిపారు.